
సాక్షి
ఖమ్మం
ఆదివారం । 14 । జులై । 2024



అటానమస్.. హర్షణీయం..
44 ఏళ్లుగా ఏజెన్సీలో విద్యార్థులు ఉన్నతులుగా తీర్చిదిద్దిన భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ పీజీ కళాశాలకు అటానమస్ హోదా లభించింది. 8లో



రైతన్నకు వరంలా ఫామ్‌పాండ్
పంటలు ఎండిపోతున్న తరుణంలో వర్షం కురిసినప్పుడు నీటిని నిల్వ చేసేలా కేంద్రం ఫామ్‌పాండ్ల నిర్మాణాన్ని ప్రోత్సహిస్తోంది. 10లో

వాతావరణం
గరిష్టం / కనిష్టం
28° / 25°
జిల్లాలో ఆదివారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. వాతావరణం చల్లగా మారుతుంది.

న్యూస్‌రీల్

శ్రీ వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



జమలాపురం ఆలయంలో భక్తులు..

ఎర్రుపాలెం: తెలంగాణా తిరుపతిగా ప్రసిద్ధి గాంచిన జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీవారి పాదానికి, శ్రీస్వామి వారి విగ్రహానికి అర్చకులు వేదమంత్రాలు, పంచామృతాలతో అభిషేకం చేశారు. ఆ తర్వాత శ్రీస్వామి వారిని, శ్రీఅలివేలు మంగ ,శ్రీపద్మావతి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించడంతో పాటు శాస్త్రోక్తంగా నిత్య కల్యాణం నిర్వహించారు. రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన భక్తులు శ్రీవారిని దర్శించుకుని పూజలు చేశారు. అర్చకులు, భక్తులు శ్రీస్వామి, , అమ్మవార్లకు పల్లకీ సేవ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ జగన్మోహన్‌రావు, ఛైర్మన్ శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, సూపరింటెండెంట్ విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

సింహపురి రైలు వేళల్లో మార్పు

ఖమ్మం రాపర్తినగర్ : దక్షిణ మధ్య రైల్వే ఆధ్వర్యంలో నడిచే సింహపురి ఎక్స్‌ప్రెస్ రైలు సమయంలో మార్పులు చోటుచేసుకున్నట్లు ఖమ్మం కమర్షియల్ టాక్స్ ఆఫీసర్ ఎం.డీ.జాఫర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 12710 నంబర్ గల రైలు సికింద్రాబాద్ - గూడూరు జంక్షన్‌కు వెళ్లే నిర్ణీత సమయం రాత్రి 2.19 నిమిషాలకు ఖమ్మం వస్తుండగా, ఈనెల 18వ తేదీ నుంచి రాత్రి 1.19 నిమిషాలకు వచ్చి 1.20కి బయలుదేరుతుందని పేర్కొన్నారు. ప్రయాణికులు గమనించాలని కోరారు.

కేజీబీవీలో డీఈఓ తనిఖీ



పాఠం బోధిస్తున్న డీఈఓ సోమశేఖరశర్మ

ఎర్రుపాలెం: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని డీఈఓ సోమశేఖరశర్మ శనివారం తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలికల కోసం ప్రభుత్వం అందించే సౌకర్యాలను వినియోగించుకోవాలని, ఉత్తమ ఫలితాలు సాధించాలని అన్నారు. విద్యార్థినులకు గణితం, ఫిజిక్స్ పాఠాలను బోధించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో బాగా రాణించాలంటే ఫిజిక్స్, గణితంపై పట్టు సాధించాలని సూచించారు. పాఠశాల ఆవరణలో కూరగాయలు, పండ్ల మొక్కలను నాటాలని ఆదేశించారు. మరమ్మతు పనులను మూడు రోజుల్లోగా పూర్తి చేయించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ వై. ప్రభాకర్, పాఠశాల సూపరింటెండెంట్ కె. సరిత పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



సాయికృష్ణ

ముదిగొండ: నేషనల్ యూత్ స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషన్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గోవాలో జరుగుతున్న జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు మండల పరిధిలోని న్యూలక్ష్మీపురానికి చెందిన వాకదాని సాయికృష్ణ ఎంపికయ్యాడు. శనివారం ప్రారంభమైన ఈ పోటీలు ఈనెల 15 వరకు కొనసాగనున్నాయి. ఈ సందర్భంగా సాయికృష్ణను పలువురు అభినందించారు.

హైకోర్టు జీపీగా కూరపాటి సుజాత



కూరపాటి సుజాత

ఖమ్మంలీగల్/చింతకాని : తెలంగాణ హైకోర్టు గవర్నమెంట్ ప్లీడర్(జీపీ)గా సీనియర్ న్యాయవాది కూరపాటి సుజాత నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ న్యాయ శాఖ కార్యదర్శి ఆర్. తిరుపతి ఉత్తర్వులు జారీ చేశారు. చింతకాని మండలం ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన సుజాత.. సాధారణ వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున హైకోర్టులో ప్రాతినిధ్యం వహించేందుకు 19 మందిని ప్రభుత్వ ప్లీడర్లుగా నియమించగా వారిలో సుజాత ఒకరు. హైదరాబాద్‌లోని అంబేద్కర్ కళాశాలలో బీకాం, పాణినీయ లా కాలేజీలో న్యాయ విద్య అభ్యసించారు. 1996లో న్యాయవాదిగా బార్ కౌన్సిల్లో పేరు నమోదు చేసుకొని కేవీ భానుప్రసాద్ వద్ద జూనియర్‌గా చేరారు. అనంతరం హైకోర్టులో ప్రాక్టీస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సుజాతను పలువురు అభినందించారు.

పంటలకు ప్రాణం..



కొదుమూరు వద్ద వర్షాలతో కళకళలాడుతున్న పత్తి చేను

జిల్లాలో రెండు రోజులుగా ముసురు
- వ్యవసాయ పనులు ముమ్మరం చేసిన రైతులు
- పలు ప్రాంతాల్లో ఊపందుకోనున్న వరి సాగు
- పత్తి, మిర్చి, అపరాల సాగుకూ అనుకూలం



వెలుగుమట్ల వద్ద పత్తి చేలో నిలిచిన వర్షపునీరు

సాక్షిప్రతినిధి, ఖమ్మం : గత రెండు రోజులుగా జిల్లాలో ముసురు పట్టి వర్షాలు కురుస్తుండడంతో రైతులు వ్యవసాయ పనులు ముమ్మరం చేశారు. తొలకరిలో వర్షాలు పలకరించకపోవడంతో సాగు ఆలస్యమైంది. పొడి దుక్కుల్లో పత్తి మాత్రమే సాగైంది. అడపాదడపా కురిసిన వర్షాలతో రైతులు దుక్కులు దున్ని సాగుకు సిద్ధమయ్యారు. అయితే ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో కొన్నిచోట్ల వరినార్లు పోయడంతోపాటు వెదజల్లే పద్ధతిలో వరి వేస్తున్నారు. జిల్లాలో శనివారం 2.6 సెంటీమీటర్ల వర్షం కురిసింది. మొక్కజొన్న, పెసర, కంది వంటి పంటలకు ఈ వర్షాలు అనుకూలంగా మారాయి. జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం 5,22,327 ఎకరాలు కాగా.. ఇప్పటి వరకు 2,32,746 ఎకరాల్లో పంటలు సాగయ్యాయి.

గతేడాది కంటే మెరుగ్గా..
వానాకాలం సీజన్ ప్రారంభమైన తర్వాత ఇప్పుడిప్పుడే వర్షాలు కురుస్తున్నాయి. ఈ ఏడాది జూన్ ఒకటి నుంచి ఈనెల 13 వరకు జిల్లాలో 30.5 సెంటీమీటర్ల వర్షం కురిసింది. ఈ నెలలో సాధారణ వర్షపాతం 21.3 సెం.మీ. కాగా.. 43.3 శాతం అధిక వర్షపాతం నమోదైంది. గతేడాది ఇదే సమయంలో 22.1 సెం.మీ.సాధారణ వర్షపాతం కాగా.. కేవలం 10.8 సెంటీమీటర్లు.. అంటే దాదాపు 50 శాతం తక్కువ కురవడం గమనార్హం. ఈ వానాకాలం సీజన్‌లో ఇప్పటి వరకు 22 రోజులు వర్షాలు కురిశాయి. జూన్‌లో 15 రోజులు, జూలైలో 7 రోజులు వాన పడింది. మొత్తం 21 మండలాలకు గాను 17 మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదైంది. రెండు మండలాల్లో సాధారణ వర్షం కురవగా.. రెండు మండలాల్లో వర్షం పడలేదు. అధికారిక లెక్కల ప్రకారం ఎక్కువ వర్షం కురిసినప్పటికీ.. జలాశయాల్లోకి ఇప్పుడిప్పుడే నీరు చేరుతోంది.

జిల్లాలో 2.6 సెం.మీ..
జిల్లాలో శనివారం 2.6 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఈ వానాకాలం సీజన్‌లో ఆకాశం మేఘావృతమై ముసురు పట్టడం ఇదే ప్రథమం. రెండు రోజులుగా కురుస్తున్న ఈ వర్షం ప్రస్తుతం పంటలకు ప్రాణం పోసింది. అత్యధికంగా ఏన్కూరులో 5.1 సెంటీమీటర్ల వర్షం కురవగా చింతకానిలో 4.7, ఖమ్మం, ముదిగొండల్లో 3.6, ఖమ్మం అర్బన్‌లో 3.5 సెం.మీ. వర్షం పడింది. జిల్లా వ్యాప్తంగా 18 మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. మూడు మండలాల్లో ఒకటి నుంచి 3 సెంటీమీటర్ల వర్షం కురిసింది.

వరి సాగుకు అనుకూలం..
వరిపంట సాగుకు ఈ వర్షాలు అనుకూలంగా ఉన్నాయి. భూగర్భ జలాలు పెరుగుతుండడంతో బోర్లు, బావుల కింద వరినార్లు పోస్తున్నారు. అలాగే నేరుగా వెదజల్లే పద్ధతిలోనూ వేస్తున్నారు. జలాశయాల్లోకి కూడా నీరు చేరుతుండగా వరిసాగు ఊపందుకుంటోంది. ప్రధానంగా సత్తుపల్లి మండలంలో 12,635 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. వేంసూరు, తల్లాడ, పెనుబల్లి మండలాల్లో 20,848 ఎకరాల్లో వెదజల్లే పద్ధతిలో వరి వేశారు. ఆగస్టు వరకు వరి నాటేందుకు, వెదజల్లే పద్ధతిలో సాగు చేసేందుకు సమయం ఉండగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులు సాగుకు సమాయత్తం అవుతున్నారు.

1.82 లక్షల ఎకరాల్లో పత్తి..
ఈ ఏడాది 5,22,327 ఎకరాల్లో పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అంచనా వేయగా.. ఇప్పటివరకు 2,32,746 ఎకరాల్లో వివిధ పంటలు వేశారు. గతేడాది ఈ సమయానికి 1,21,130 ఎకరాల్లో మాత్రమే పంటలు సాగయ్యాయి. జిల్లాలో పత్తి సాధారణ సాగు 2,23,656 ఎకరాలు కాగా ఇప్పటికే 1,82,304 ఎకరాల్లో విత్తనాలు వేశారు. జూన్ మొదటి వారం నుంచి అడపా దడపా కురిసిన వర్షాలకు చాలా మంది రైతులు పత్తి విత్తనాలు నాటారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో పాదులు చేయడం, ఎరువులు వేయడం వంటి పనులు చేస్తున్నారు.

ఇతర పంటలిలా..
జిల్లాలో ప్రస్తుతం మొక్కజొన్న విత్తనాలు వేస్తున్నారు. పెసర, కంది వంటి పంటలు కూడా సాగులో ఉన్నాయి. మిర్చి నారు పోసేందుకు అనుకూలమైన ఎత్తు మడులు తయారవుతున్నాయి. పెసర పంట చింతకానిలో 5,989 ఎకరాలు, కొణిజర్ల మండలంలో 3,724 ఎకరాల్లో సాగైంది. పెసర సాధారణ సాగు విస్తీర్ణం 17,034 ఎకరాలు కాగా.. ప్రస్తుతం 12,354 ఎకరాల్లో సాగవుతోంది. వర్షాలు కొంత మేరకు సమృద్ధిగా కురిస్తే వ్యవసాయ శాఖ తయారు చేసిన అంచనాల మేరకు సాగవుతాయని భావిస్తున్నారు.

పంటల వారీగా ఈ ఏడాది సాధారణ సాగు, గత ఏడాది, ఈ ఏడాది సాగైన పంటలు.. (ఈ సమయానికి, ఎకరాల్లో..)

పంట	సాధారణ సాగు	2023	2024
వరి	2,75,143	8,497	36,517
జొన్న	19	-	-
మొక్కజొన్న	3,984	387	1,363
కంది	2,131	82	117
పెసలు	17,034	5,384	12,354
మినుములు	203	38	51
వేరుశనగలు	157	02	40
పత్తి	2,23,656	1,06,740	1,82,304
మొత్తం	5,22,327	1,21,130	2,32,746

శనివారం నమోదైన వర్షపాతం..

మండలం	వర్షపాతం (సెం.మీ.)
ఏన్కూరు	5.1
చింతకాని	4.7
ఖమ్మం	3.6
ముదిగొండ	3.6
ఖమ్మంఅర్బన్	3.5
కొణిజర్ల	3.2
పెనుబల్లి	3.2
వేంసూరు	3.1
కామేపల్లి	2.7
రఘునాథపాలెం	2.5
తిరుమలాయపాలెం	2.5

పారిశుద్ధ్య సమస్య పరిష్కరించాలి

కేఎంసీ అధికారులు, కార్పొరేటర్ల సమీక్షలో మంత్రి తుమ్మల



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల, పక్కన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, మేయర్, కమిషనర్

ఖమ్మంమయూరిసెంటర్ : 'అధికారుల తీరు సక్రమంగా లేదు. పారిశుద్ధ్యం పద్ధతి ప్రకారం జరగడం లేదు. దీన్ని మెరుగుపర్చాలి. నేను మళ్లీ సమావేశం నిర్వహించేలోపు అంతా మారిపోవాలి'. అని రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శనివారం ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ పునుకొల్లు నీరజ, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య తదితరులతో కలిసి పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఖమ్మం ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని, మంచి గాలి, వాతావరణం ఉన్న ప్రాంతాల్లోనే జీవనానికి ఇష్టపడతారని అన్నారు. డివిజన్లలో పారిశుద్ధ్య సిబ్బంది తక్కువగా ఉన్నారని, ఒక్కో డివిజన్‌కు పది మంది చొప్పున సిబ్బందిని కేటాయించడంతో సక్రమంగా పనులు చేయించలేకపోతున్నామని పలువురు కార్పొరేటర్లు తెలిపారు. శానిటేషన్‌కు ప్రత్యేక అధికారి లేకపోవడం, శానిటరీ ఇన్‌స్పెక్టర్, జవాన్‌ల మధ్య సమన్వయం లేకపోవడంతో పారిశుద్ధ్య పనులు సరిగ్గా జరగడం లేదన్నారు. ఇంకా పలు సమస్యలు ఏకరువు పెట్టిన కార్పొరేటర్లు.. నిర్మాణ వ్యర్థాలను రోడ్ల వెంట వేసి ఎత్తడం లేదని, అధికారులు స్పందించడం లేదని అన్నారు. ఇక ఇంజనీరింగ్ అధికారిణి ఫోన్ ఎత్తడం లేదని, కనీస సమాధానం చెప్పే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రత్యేక ప్రణాళికతో ముందుకు..
నగరంలో పారిశుద్ధ్య సమస్య పరిష్కారం కోసం ప్రత్యేక ప్రణాళికతో పనులు చేపడుతున్నామని అసిస్టెంట్ కమిషనర్ సంపత్‌కుమార్ వెల్లడించారు. అదనంగా కార్మికులను ఏర్పాటు చేసుకుని రోజుకు రెండు డివిజన్ల చొప్పున ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఐటీ హబ్, మమత రోడ్డు పీవీ నరసింహారావు విగ్రహం వద్ద, బోనకల్ రోడ్, పెట్రోల్‌బంక్ తదితర ప్రాంతాల్లో నిల్వ నీటిని తొలగించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. డంపింగ్‌యార్డు వద్ద రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించామని, త్వరలోనే రోడ్డు పూర్తి చేస్తామని, ఐటీ హబ్ వద్ద డ్రెయినేజీ నిర్మాణానికి నిధులు కేటాయించినట్లు ఎస్ఈ రంజిత్ తెలిపారు.

పద్ధతి ప్రకారం పనులు చేయండి..
ఇప్పటి వరకు నగరంలో అభివృద్ధి పనులు పద్ధతి ప్రకారం జరగలేదని, భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని 50 సంవత్సరాలకు ఉపయోగపడేలా పనులు జరగాలని మంత్రి తుమ్మల అధికారులను ఆదేశించారు. పనులు జరగకపోతే అధికారులు, కార్పొరేటర్లదే బాధ్యత అన్నారు. డ్రెయిన్లపై మెట్లు, ఇతర నిర్మాణాలు జరుగుతుంటే అడ్డుకోవాల్సిన బాధ్యత కార్పొరేటర్లపై ఉందన్నారు. నగరంలో వీధి దీపాలు చాలా చోట్ల వెలగడం లేదని కార్పొరేటర్లు మంత్రి దృష్టికి తీసుకురాగా.. సదరు కాంట్రాక్ట్‌ను సస్పెండ్ చేయాలని, అధికారులు బాధ్యతగా ఉండి.. ఇలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని చెప్పారు.

వెలుగుమట్ల పార్క్‌ను అభివృద్ధి చేయాలి..
నగరంలో వెలుగుమట్ల పార్క్, ఖిల్లాను అభివృద్ధి చేసుకుంటే టూరిజం మెరుగవుతుందని మంత్రి తుమ్మల అన్నారు. వెలుగుమట్ల పార్కు నాలుగు లేదా ఐదు లైన్ల రోడ్డును గేటు వరకు నిర్మించాలన్నారు. దీనికి అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని ఆదేశించారు. ఖిల్లాకు రోప్‌వే ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ కార్పొరేషన్ల అభివృద్ధి చెందాలంటే పారిశుద్ధ్య నిర్వహణ, రాబడి, టౌన్‌ప్లానింగ్ ప్రధానమని, ఖమ్మం నగరానికి ఈ వనరులన్నీ ఉన్నాయని అన్నారు. ప్రణాళిక ప్రకారం పారిశుద్ధ్య నిర్వహణ చేస్తామన్నారు.

ఏజెన్సీలో ఉద్యోగాల్లో గిరిజనులే ఉండాలి



నవభారత్ కర్మాగారంలో అధికారులతో సమీక్షిస్తున్న హుస్సేన్ నాయక్

పాల్వంచ/బూర్గంపాడు/భద్రాచలంటౌన్: ఏజెన్సీ ఏరియాలో ప్రభుత్వం, ప్రైవేట్ రంగాల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు తప్పనిసరిగా గిరిజనులై ఉండాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ నాయక్ అన్నారు. శనివారం ఆయన నవభారత్, కేటీపీఎస్ కర్మాగారాలను సందర్శించారు. అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. నవభారత్ కర్మాగారం స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వడంలేదని, సీఎస్సార్ నిధులు ఇతర ప్రాంతాల్లో వినియోగిస్తున్నారని పలువురు ఫిర్యాదు చేయగా, వీటిపై తనకు నివేదిక ఇవ్వాలని కర్మాగారం అధికారులను ఆదేశించారు. అనంతరం కేటీపీఎస్ 5,6 దశల కర్మాగారాన్ని సందర్శించగా, పలు ఎస్టీ కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో విద్యుత్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, ఆర్టిజన్ కార్మికులకు క్వార్టర్లు లేవని, సీఎస్ఆర్ నిధులు స్థానికంగా వినియోగించడం లేదని, ఉపాధి పనుల్లో స్థానికులకు ఇవ్వడం లేదని తెలిపారు. దీంతో సమస్యలపై ప్రశ్నించగా, అవి యాజమాన్యం పరిధిలో ఉన్నాయని సీఈ ఎం.ప్రభాకర్‌రావు బదులిచ్చారు. అనంతరం హుస్సేన్ నాయక్ మాట్లాడుతూ నవభారత్, కేటీపీఎస్ కర్మాగారాల్లో పనిచేసే సిబ్బంది తెలంగాణా వారై ఉండాలని, అందులో ఎక్కువ శాతం గిరిజనులకు అవకాశం కల్పించాలన్నారు. నిర్వాసితులు, పరిసర ప్రాంతాల ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. సారపాక ఐటీసీ పీఎస్‌పీడీ గెస్ట్‌హౌస్‌లో కార్మికుల సమస్యలపై ట్రేడ్ యూనియన్ల నాయకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఐటీసీ పీఎస్‌పీడీలో కూడా గిరిజనులకు ఉపాధి అవకాశాల్లో అగ్రస్థానం కల్పించాలని యాజమాన్యాన్ని కోరారు. ఆదివాసీ గిరిజనుల సంక్షేమంతో పాటు వైద్యం, విద్యాభివృద్ధి, రైతు సమస్యల పరిష్కారానికి ఐటీడీఏలను స్థాపించారని హుస్సేన్ నాయక్ తెలిపారు. ఐటీడీఏ సమావేశం మందిరంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజన గ్రామాల్లో విద్యా, వైద్యం రహదారి సౌకర్యాలు ఉండేలా అధికారులు శ్రద్ధ చూపాలన్నారు. గిరిజనులకు పోడు పట్టాలు, గిరిజన పాఠశాలల్లో సమస్యలపై ఆదివాసీ సంఘాల నాయకులు వినతి పత్రాలు సమర్పించగా, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆ తర్వాత ఎంఎస్ఎంఈ యూనిట్ మహిళలు తయారుచేసిన సబ్బులు, షాంపూలను పరిశీలించారు. కాగా పలువురు అధికారులు, కార్మికులు, సంఘాల నాయకులు ఎస్టీ కమిషన్ సభ్యుడిని సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, అధికారులు డేవిడ్‌రాజ్, భీకంసింగ్, తానాజీ, డి మణెమ్మ, చంద్రమౌళి, శ్రీనివాసరావు, మధు, దామోదర్‌రావు, అనసూయ, ఇందిర, రుక్మిణి, తిరుమలేష్, ప్రభాకర్ రావు, వెంకటేశ్వరరాజు, భాస్కర్, శ్రీనివాస్, సురేష్‌బాబు, ట్రికార్ జీఎం శంకర్ రావు, నవభారత్ సంస్థ సీఎండీ శరత్‌బాబు, జీఎం రాజేశ్వరరావు, కేటీపీఎస్ సీఈ ఎం.ప్రభాకర్‌రావు, శ్రీనివాసరావు, బీజేపీ నాయకుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కార్మిక, గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



జల్లేపల్లిలో అధ్వానంగా ఉన్న ఓ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న వైద్యాధికారులు

- డీడీఎంహెచ్‌ఓ సైదులు సూచన
- జల్లేపల్లిలో జ్వరాల తీవ్రతపై పరిశీలన

తిరుమలాయపాలెం: పారిశుద్ధ్య చర్యలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సైదులు ప్రజలకు సూచించారు. మండలంలోని జల్లేపల్లిలో డెంగీ జ్వరాల తీవ్రత నేపథ్యంలో డీఎంఓ లక్ష్మీనారాయణతో కలిసి శనివారం ఆయన గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎవరికైనా జ్వరం వస్తే వెంటనే ప్రభుత్వ వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్య సిబ్బందితో పాటు జెడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్ తదితరులు గ్రామంలో తిరిగి ప్రజలకు అవగాహన కల్పించారు. జ్వర పీడితులను తీవ్రతను బట్టి తిరుమలాయపాలెం సీహెచ్‌సీకి పంపిస్తున్నారు. గ్రామంలో పూర్తి స్థాయిలో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపడితే తప్ప జ్వరాల తీవ్రత తగ్గే పరిస్థితి లేదని వైద్యాధికారులు అంటున్నారు. కార్యక్రమంలో ఎంపీఓ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడ చూసినా మురుగే..
జల్లేపల్లి గ్రామంలో ఏ వీధి చూసిన మురుగునీటి గుంతలు, డ్రెయిన్లు, పాత బావుల్లో నిలిచిన నీటితో అధ్వానంగా దర్శనమిచ్చాయి. గత 25 రోజులుగా గ్రామంలో జ్వరాల తీవ్రత పెరుగుతుండగా ఏడు డెంగీ పాజిటివ్ కేసులతో పాటు, టైఫాయిడ్ జ్వరాలు నమోదయ్యాయి. అయినా మండల అధికారులు పూర్తి స్థాయిలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టడం లేదు. నిధుల కొరత పేరుతో గ్రామాన్ని ఎవరూ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ శనివారం జల్లేపల్లికి వస్తారనే ప్రచారం జరగడంతో అధికారులు ఒకటి రెండు చోట్ల మురుగునీటి కాల్వలను శుభ్రం చేశారని, దోమల నివారణకు ఆయిల్ బాల్స్ కూడా వేయడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బొగ్గు ఉత్పత్తికి అంతరాయం

సత్తుపల్లి : ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి సింగరేణిలో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. సత్తుపల్లి మండలం కిష్టారం ఓపెన్‌కాస్టులో 5 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి, 45 వేల క్యూబిక్ మీటర్ల మట్టి తొలగింపు పనులకు అంతరాయం ఏర్పడగా.. సత్తుపల్లి జేవీఆర్ ఓసీలో 15 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి, 90 వేల క్యూబిక్ మీటర్ల మట్టి తొలగింపునకు అంతరాయం వాటిల్లిందని ఆయా ఓసీల పీఓలు ప్రహ్లాద్, నర్సింహారావు తెలిపారు.


ఉన్నత లక్ష్యాలు సాధించాలి

కేయూ స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ వెంకయ్య

ఖమ్మం సహకారనగర్: విద్యార్థులు మనో స్థైర్యంతో ఉన్నత లక్ష్యాలు సాధించాలని కాకతీయ యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్య అన్నారు. స్థానిక కేయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో శనివారం నిర్వహించిన సీనియర్ విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడారు. అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని ఉపాధి సాధించాలని అన్నారు. ఆరోగ్యకర సమాజ నిర్మాణంలో క్రీడా ఉపాధ్యాయులే కీలకమన్నారు. క్రీడా విద్యకు మంచి గుర్తింపు ఉందని, కళాశాలలో నేర్చుకున్న విద్యను భావితరాలకు నేర్పాలని పిలుపునిచ్చారు. ఎస్ఆర్ అండ్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎన్.గోపి మాట్లాడగా ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ రవికుమార్, క్రీడా ఉపాధ్యాయులు పి మధు, పి.శ్రీనివాస్, పి.కోటయ్య పాల్గొన్నారు.


ఇన్‌చార్జ పాలనకు తెర

- ఎట్టకేలకు ఖమ్మం డెయిరీకి రెగ్యులర్ డీడీ
- ఇకనైనా లక్ష్యం సాధించేనా..?



మోహన మురళి

ఖమ్మంవ్యవసాయం: తెలంగాణ పాడి పరిశ్రమాభివృద్ధి సహకార ఫెడరేషన్(విజయ డెయిరీ) ఖమ్మం యూనిట్‌కు ఎట్టకేలకు రెగ్యులర్ డిప్యూటీ డైరెక్టర్ రానున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన ఉద్యోగుల బదిలీల్లో భాగంగా ఖమ్మం డెయిరీ డీడీగా మోహన మురళిని నియమించారు. దీంతో ఆరేళ్లకు పైగా కొనసాగిన ఇన్‌చార్జ్‌ల పాలనకు ఇక తెరపడనుంది. ఇంతకాలం ఈ డెయిరీ పాలనా పరమైన సమస్యలు, అవినీతి అక్రమాలతో లక్ష్య సాధనలో వైఫల్యాలను మూటగట్టుకుంది. జిల్లాలో ఉన్న పాడి వనరుల ఆధారంగా 1975లో సుమారు 50 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన పాడి పరిశ్రమను ఖమ్మంలో నెలకొల్పారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఈ పరిశ్రమకు అనుబంధంగా బల్కుమిల్క్ సెంటర్లను ఏర్పాటు చేసి లక్ష్యాలను సాధించి రాష్ట్రంలో గుర్తింపు పొందిన చరిత్ర ఉంది. కాల క్రమంలో పాలన గాడి తప్పడంతో అనేక అవినీతి అక్రమాలు చోటుచేసుకున్నాయి. ఈ పరిశ్రమలో పనిచేసిన అధికారులు, ఉద్యోగులు



ఖమ్మం డెయిరీలోని డీడీ కార్యాలయం

ఇష్టారాజ్యంగా వ్యవహరించి అందినంత దోచుకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. రూ. లక్షల విలువ చేసే పాలు, పాల ఉత్పత్తులైన వెన్న తదితరాలను పక్కదారి పట్టించి అక్రమాలకు పాల్పడిన వ్యవహారాలు అనేకం వెలుగుచూశాయి. అధికారులు, ఉద్యోగుల మధ్య ఉన్న విభేదాలతో ఈ అక్రమాలన్నీ ఏడాది క్రితం బయటపడ్డాయి. ఈ వ్యవహారంలో ఐదుగురు అధికారులు, ఉద్యోగులు సస్పెన్షన్‌కు గురయ్యారు. ఇప్పటి వరకు కూడా ఆయా అధికారులను తిరిగి విధుల్లోకి తీసుకోలేదు.

ఆరేళ్లకు పైగా ఇన్‌చార్జ్‌లే..
ఖమ్మం పాడి పరిశ్రమకు ఆరేళ్లకు పైగా రెగ్యులర్ డీడీని నియమించలేదు. పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు, ఉప సంచాలకులను ఈ డెయిరీకి డిప్యుటేషన్‌పై నియమించారు. లేదంటే డెయిరీలో పనిచేసే మేనేజర్లకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. 2017 - 18 నుంచి ఇదే తంతు కొనసాగింది. ఆరు నెలల క్రితం వరకు పశుసంవర్ధక శాఖ అధికారి ఇక్కడ డీడీ బాధ్యతలు నిర్వహించారు. పరిశ్రమ పరిస్థితి పూర్తిగా దిగజారుతుండడంతో గత జనవరిలో జనగాం డెయిరీ డీడీ ధన్‌రాజ్‌కు ఖమ్మం డెయిరీ అదనపు బాధ్యతలు అప్పగించారు. అయితే ఆయనకు దూర ప్రాంతంలో ఉన్న రెండు డెయిరీల నిర్వహణ ఇబ్బందికరంగా మారింది. ఎట్టకేలకు రాష్ట్ర వ్యాప్తంగా డిప్యూటీ డైరెక్టర్లను పెద్ద ఎత్తున బదిలీలు చేయగా.. సంగారెడ్డి డెయిరీలో డీడీగా పనిచేస్తున్న మోహన్ మురళిని ఖమ్మం డెయిరీకి నియమించారు. అయితే గతంలో 2011-13 , 2017-18 సంవత్సరాల్లో మోహన మురళి ఖమ్మం డెయిరీ డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేశారు. 2017 - 18లో ఖమ్మం డెయిరీలో రూ. 33 లక్షల విలువైన నూతన పరికరాలు, కంప్రెషర్లు, పెరుగు ప్యాకింగ్ యూనిట్ల ఏర్పాటు చేశారు. ప్రస్తుతం మూడోసారి ఆయనను డీడీగా నియమించారు.

ఇప్పటికైనా గాడిలో పడేనా..?
లక్ష్య సాధనలో వైఫల్యాలను మూటగట్టుకున్న ఖమ్మం డెయిరీ రెగ్యులర్ డీడీ నియామకంతో తిరిగి గాడిలో పడుతుందా అనే అంశం రైతులు, ఉద్యోగుల్లో చర్చనీయాంశంగా మారింది. ఖమ్మం పాడి పరిశ్రమపై పట్టున్న మోహన మురళి తప్పిదాలను గుర్తించి దారిలో పెట్టే అవకాశం ఉందని భావిస్తున్నారు. పరిశ్రమను తిరిగి గాడిలో పెట్టేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటారనే ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కాగా, మోహన మురళి ఒకటి రెండు రోజుల్లో డీడీగా బాధ్యతలు తీసుకుంటారని సమాచారం. కాగా, ఖమ్మం విజయ డెయిరీ జూనియర్ మేనేజర్ పి అశోక్ కుమార్‌ను వరంగల్ డెయిరీకి బదిలీ చేస్తూ సంస్థ ఎండీ ఉత్తర్వులు జారీ చేశారు. ఇన్‌చార్జ్ డీడీగా పనిచేస్తున్న డి.ధన్‌రాజ్‌ను నాగర్‌కర్నూల్ జిల్లాకు బదిలీ చేశారు.

క్లుప్తంగా

మహిళలకు రేపు జాబ్‌మేళా

ఖమ్మం రాపర్తినగర్ : జిల్లాలోని నిరుద్యోగ మహిళలకు ఈనెల 15న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి కొండపల్లి శ్రీరాం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రిలయన్స్ నిప్పాన్ ఇన్సూరెన్స్ కంపెనీలో లైఫ్ ప్లానింగ్ ఆఫీసర్ పోస్టులు 50 ఖాళీలు ఉన్నాయని, వీటి కోసం దరఖాస్తు చేసుకునే వారు కనీసం డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు. ఖమ్మం గాంధీచౌక్‌లోని కొటక్ మహీంద్ర బ్యాంక్‌లో ఇంటర్వ్యూలు ఉంటాయని, 35 – 40 ఏళ్ల మధ్య వయసు గల వారే అర్హులని తెలిపారు. ఎంపికైన వారికి నెలకు రూ.15 వేల నుంచి రూ. 25 వేల వరకు వేతనం ఉంటుందని, ఆసక్తి గలవారు జిరాక్స్ సర్టిఫికెట్లతో ఉదయం 10 గంటలకు హాజరు కావాలని సూచించారు.

పెన్షన్‌దారుల సొమ్ము వెనక్కి..

నేలకొండపల్లి : రెండు రకాల పింఛన్ పొందుతున్న పెన్షన్‌దారులు ఇరువురు సొమ్మును వెనక్కి తిరిగి ఇచ్చారు. మండల కేంద్రానికి చెందిన ఎన్. అనుసూర్య, పి.వెంకమ్మ రెండు రకాల పింఛన్ పొందుతున్నారు. ఇటీవల ప్రభుత్వం రెండు రకాల పెన్షన్ పొందుతున్న వారి నుంచి రికవరీ చేయాలని ఆదేశించగా నేలకొండపల్లి పంచాయతీ కార్యదర్శి దేవేందర్ ఇరువురికీ ఐదు రోజుల క్రితం నోటీసులు జారీ చేశారు. దీంతో వారిద్దరూ రూ.1.72 లక్షల చొప్పున సెర్ప్ ఖాతా కు జమ చేశారు.

సైబర్ మోసం.. రూ.58,425 మాయం

కల్లూరు: కల్లూరు మండలంలో ఓ బాధితరాలు మిత్ర యాప్ ద్వారా ఆన్‌లైన్ ప్రొడక్ట్ కోసం ఆర్డర్ పెట్టగా ఓ గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి 'మీ ఆర్డర్‌కు అడ్రస్ అప్‌డేట్ గురించి ఫోన్ చేస్తున్నామని, రూ. 2 పంపించాలని లింక్ పంపించాడు. బాధితురాలు ఆ లింకును ఓపెన్ చేసి రూ. 2 పంపించింది. మరుసటి రోజు తన అకౌంట్ నుంచి రూ. 58,425 కట్ అయ్యాయి. శనివారం రాత్రి బాధితురాలు కల్లూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సైబర్ క్రైమ్ కింద ఎస్ఐ ఎస్‌కే షాకీర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళా కండక్టర్‌ను దూషించిన వ్యక్తిపై కేసు

ఖమ్మంరూరల్: ఆర్టీసీ బస్సులో మహిళా కండక్టర్‌ను దూషించిన వ్యక్తిపై శనివారం రాత్రి ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఖమ్మం నుంచి తొర్రూర్ వెళ్తున్న బస్సులో తొర్రూర్‌కు చెందిన ఉపాధ్యాయుడు షేక్ దర్గాహుస్సేన్ తన కుమార్తెతో కలిసి ప్రయాణిస్తున్నాడు. వరంగల్ క్రాస్‌రోడ్ వద్దకు రాగానే కండక్టర్ కరుణశ్రీ టికెట్లు కొడుతుండగా దర్గాహుస్సేన్ తన కుమార్తె ఆధార్ కార్డును సెల్‌ఫోన్‌లో చూపించాడు. సెల్‌ఫోన్‌లో చూపిస్తే కుదరదని, కార్డు వెంట ఉండాలని, లేదంటే డబ్బు చెల్లించాలని చెప్పగా ఆగ్రహించిన దర్గాహుస్సేన్ కరుణశ్రీని దూషించాడు. ఈ మేరకు బాధితురాలు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పుష్‌కుమార్ తెలిపారు.

మహిళను రక్షించిన అంబులెన్స్ డ్రైవర్

భద్రాచలంఅర్బన్: భద్రాచలం వద్ద గోదావరి బ్రిడ్జి పై నుంచి దూకేందుకు ప్రయత్నిస్తున్న ఓ మహిళను మణుగూరుకు చెందిన అంబులెన్స్ డ్రైవర్ ప్రదీప్ రక్షించాడు. ఓ గర్భిణిని మణుగూరు నుంచి భద్రాచలం ఆస్పత్రికి తీసుకొచ్చిన అనంతరం తిరుగు ప్రయాణంలో గోదావరి పాత బ్రిడ్జి సైడ్ వాల్‌పై ఓ మహిళ కూర్చొని ఉన్న దృశ్యాన్ని గమనించాడు. ఆమె వద్దకు వెళ్లి వివరాలు తెలుసుకుని, ఆత్మహత్య చేసుకోకుండా నచ్చజెప్పి అంబులెన్స్‌లో భద్రాచలం తీసుకెళ్లాడు. డ్రైవర్ సమాచారంతో వచ్చిన పోలీసులు మహిళతో మాట్లాడి వివరాలు సేకరించారు.

అలరించిన నృత్యనీరాజనం



నృత్యం చేసేందుకు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన చిన్నారులు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థాన ఆవరణంలోని చిత్రకూట మండలంలో శనివారం నిర్వహించిన స్వర నృత్య నీరాజన కార్యక్రమం భక్తులను అలరించింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన 80 మంది చిన్నారులు కూచిపూడి నృత్యాలు ప్రదర్శించి ఆహూతులను అబ్బురపరిచారు. భద్రాచలానికి చెందిన రాగ రమ్య సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. బాలబాలికలు కళారంగంలో పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హాస్యబ్రహ్మ డాక్టర్ శంకర నారాయణ పేర్కొన్నారు. భవాని, విద్యాలత, జయశ్రీ, డాక్టర్ సౌజన్య రాజన్, నిర్వాహకురాలు రమ్య, కళాకారులు మల్లమోహన్ కుమార్, కొండల్ రావు, లాస్య, భారతి పాల్గొన్నారు.



పామాయిల్ గెలలు	
టన్ను ధర	రూ.13,705

అటానమస్.. హర్షణీయం



భద్రాచలంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల

- భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు స్వయం ప్రతిపత్తి హోదా
- ఉత్తర్వులు జారీ చేసిన యూజీసీ
- ఏజెన్సీలో ఉన్నతవిద్యనందించిన కాలేజీకి తగిన గుర్తింపు

భద్రాచలం: నలభై నాలుగేళ్లుగా ఏజెన్సీల్లోని విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దుతున్న భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల అటానమస్(స్వయం ప్రతిపత్తి) హోదా దక్కించుకుంది. 2024–25 విద్యా సంవత్సరం నుంచి 2028–29 వరకు స్వయంప్రతిపత్తి హోదా కల్పిస్తూ యూజీసీ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జాన్‌మిల్టన్ శనివారం వివరాలు వెల్లడించారు.

మూడుసార్లు న్యాక్ గుర్తింపు

ఏజెన్సీలో ఉన్నత విద్యను అందించేందుకు ప్రభుత్వం 1980లో భద్రాచలంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేసింది. తొలుత బీఏ, బీకాం కోర్సులు, అనంతరం 1989వ సంవత్సరంలో సైన్స్ విభాగాలు, ఆ తర్వాత 2006లో పీజీ కోర్సులు సైతం అందుబాటులోకి వచ్చాయి. 44 ఏళ్లుగా ఎందరో విద్యార్థులు ఇక్కడ ఉన్నత విద్యను అభ్యసించారు. ఇప్పటికే మూడు సార్లు నేషనల్ అసెస్‌మెంట్ అక్రిడిటేషన్ కౌన్సిల్(నాక్) గుర్తింపును పొందింది. 2007లో బీ, 2016లో బీ గ్రేడ్, 2023లో బీ ప్లస్ గ్రేడ్‌ను సాధించింది. బోధన, బోధనేతర సిబ్బంది అత్యుత్తమ క్రమశిక్షణ, కృషితో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే రాష్ట్రస్థాయి ర్యాంకులతో గుర్తింపు పొందింది.

అడ్డంకులను అధిగమించి..

స్వయంప్రతిపత్తి గుర్తింపు పొందేందుకు మార్చిన నియమ నిబంధనల ప్రకారం బీ గ్రేడ్ ఉన్న కళాశాల సైతం దరఖాస్తు చేసుకునేందుకు వెసులుబాటు కల్పించటంతో గతేడాది జూన్‌లోనే దరఖాస్తు చేశారు. సాంకేతిక కారణాల రీత్యా రిజెక్ట్ కావడంతో ప్రిన్సిపాల్, ఇతర అధ్యాపకులు కలిసి ఆ అడ్డంకులను అధిగమించి మళ్లీ దరఖాస్తు చేశారు. దీంతో అటానమస్ గుర్తింపునకు కావాల్సిన అన్నింటికి మార్గం సుగమమైంది. అటానమస్ గుర్తింపు లభించడంతో రాష్ట్రస్థాయిలో పేరు ప్రఖ్యాతులు ఇనుమడింపజేసినట్లయింది. స్వయంప్రతిపత్తి లభించడంతో స్థానిక వనరులు, అవసరాలకు తగినట్లు విద్యార్థుల ఉపాధి, భవిష్యత్ కోర్సులు, కరిక్యులమ్, కో–కరిక్యులమ్ తదితర విభాగాల రూపకల్పన చేసుకునే అకాశంఉంది. స్వతంత్ర నిర్ణయాధికారాలు తీసుకోవచ్చు. 80 శాతం యూనివర్శిటీ సిలబస్, 20 శాతం సిలబస్‌ను స్థానిక విద్యార్థుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని రూపకల్పన చేసే అవకాశం ఉంటుందని విద్యావేత్తలు చెబుతున్నారు. ఉన్నత విద్యలో గుణాత్మక, పరిణాత్మక మార్పులకు దోహదపడనుంది.

ఏజెన్సీకీర్తి ఇనుమడిస్తుంది



భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు అటానమస్ గుర్తింపు లభించడం హర్షణీయం. ఇప్పటికే దేశంలో ఉన్న సుమారు 190 కళాశాలలకు వరుసగా అటానమస్ గుర్తింపు పత్రాలను అందజేశారు. స్వయంప్రతిపత్తి హోదా లభించడంతో భద్రాచలం ఏజెన్సీ కీర్తి ఇనుమడింపజేసినట్లయింది.

–కె.జాన్ మిల్టన్, ప్రిన్సిపాల్, ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల

జోస్ ఆలుక్కాస్ షోరూం ప్రారంభం



జోస్ ఆలుక్కాస్ షోరూంను ప్రారంభిస్తున్న మంత్రి తుమ్మల, పక్కన నటి సంయుక్త మీనన్, ఎండీలు వర్గీస్ ఆలుక్కా, పాల్ జె ఆలుక్కా

- సందడి చేసిన సినీనటి సంయుక్త మీనన్
- ప్రారంభోత్సవ ఆఫర్లను ప్రకటించిన యాజమాన్యం



సంస్థ డైరెక్టర్లతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సినీనటి సంయుక్త మీనన్

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం నగరంలోని వైరారోడ్‌లో సరికొత్త హంగులతో వైవిధ్యభరితంగా నెలకొల్పిన జోస్ ఆలుక్కాస్ షోరూంను రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సంస్థ ఎండీలు వర్గీస్ ఆలుక్కా, పాల్ జె ఆలుక్కాలతో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పసిడి ప్రియుల మన్ననలు పొందేలా నూతన షోరూంను నిర్వహించాలని సూచించారు. ప్రారంభోత్సవ వేడుకలో సెలబ్రిటీ అతిథిగా హాజరైన సినీనటి సంయుక్త మీనన్ సందడి చేశారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం డైరెక్టర్లతో కలిసి షోరూంలో తిరుగుతూ పసిడి ప్రియులకు ఆభరణాలను చూపిస్తూ ఉత్సాహపరిచారు. జోస్ ఆలుక్కాస్ సంస్థ తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, పుదుచ్చేరి, కర్నాటక, కేరళ రాష్ట్రాల్లో అనేక షోరూంలు ఏర్పాటు చేసి ప్రజల మనసులను గెలుచుకుందని అన్నారు. ఎండీలు వర్గీస్ ఆలుక్కా, పాల్ జె ఆలుక్కా మాట్లాడుతూ.. ఖమ్మం షోరూం ప్రారంభం సందర్భంగా ప్రత్యేక ఆఫర్లు ప్రకటించారు. కనీసం రూ. 60 వేల విలువైన బంగారు ఆభరణాలు, వజ్రాలు కొనుగోలు చేసే వారికి ప్రోత్సాహకంగా ఒక బంగారు నాణెం ఇస్తామని, ఈ అవకాశం ఈనెల 19 వరకు మాత్రమే ఉంటుందని తెలిపారు. వినియోగదారులు వజ్రాలపై 20 శాతం, ప్లాటినంపై 7 శాతం తగ్గింపు పొందవచ్చని పేర్కొన్నారు. పాత బంగారాన్ని హెచ్‌యూఐడీ హాల్‌మార్క్ కలిగిన కొత్త బంగారు ఆభరణాలతో ఎక్స్ఛేంజ్ చేసుకునే అవకాశం కూడా ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఖమ్మం నగర మేయర్ పునుకొల్లు నీరజ, సాధు రమేష్ రెడ్డి, కమర్తపు మురళి, తుపాకుల యలగొండ స్వామి, మలీదు జగన్, ఖాదర్ బాబా, తాతా రఘురాం, సింగు రాజయ్య పాల్గొన్నారు.

15 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

కల్లూరు: మండలంలోని రఘునాథబంజర్‌లో సివిల్ సప్లయ్ జిల్లా అధికారి కె. చందన్‌కుమార్, డీటీ సత్యనారాయణ, సివిల్ సప్లయ్ ఆర్ఐ కిరణ్‌కుమార్ శనివారం తనిఖీలు చేపట్టగా గ్రామానికి చెందిన షేక్ మస్తాన్ ఇంట్లో అక్రమంగా 30 ప్లాస్టిక్ సంచులలో నిల్వ ఉచినం పీడీఎఫ్ బియ్యం లభ్యమయ్యాయి. ఈ మేరకు మస్తాన్‌పై 6ఏ కింద కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. మస్తాన్ పలు గ్రామాల నుంచి బియ్యం సేకరిస్తున్నాడని సమాచారం తెలుసుకున్న అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేయడంతో అక్రమ నిల్వలు బయటపడ్డాయి.

హోటల్‌పై సివిల్ సప్లయ్ డీటీ దాడి

కల్లూరు ఎన్నెస్పీలో శనివారం ఓ హోటల్‌లో సివిల్ సప్లయ్ డీటీ సత్యనారాయణ ఆకస్మిక తనిఖీ చేశారు. హోటల్ యజమానులు వ్యాపారానికి సంబంధించి కమర్షియల్ గ్యాస్ సిలిండర్లు వాడాల్సి ఉండగా, గృహ అవసరాల నిమిత్తం వాడే సిలిండర్‌లను వినియోగిస్తుండడంతో వారిపై 6ఏ కింద కేసు నమోదు చేశారు.



కల్లూరులోని ఓ హోటల్‌లో తనిఖీ చేస్తున్న డీటీ

పెనుబల్లిలో..

పెనుబల్లి : రేషన్ డీలర్లు బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో శనివారం డీసీఓ చందన్ కుమార్ ఆధ్వర్యంలో టేకులపల్లి, ఎరుగట్ల, రామచంద్రపురం షాపులను తనిఖీ చేశారు. కోళ్ల ఫారాలకు రేషన్ బియ్యం తరలిస్తున్నారన్న అనుమానిత వ్యక్తుల ఇళ్లలో సోదాలు నిర్వహించారు. కాగా, అక్రమ బియ్యం లభించలేదని తెలిసింది.

పోలీస్‌స్టేషన్‌లో మహిళ హల్‌చల్

ఖమ్మంఅర్బన్: నగరంలోని ఖమ్మంఅర్బన్ (ఖానాపురం హవేలీ) పోలీస్ స్టేషన్‌లో విచారణ కోసం పిలిపించిన ఒక మహిళ శనివారం హల్‌చల్ చేసినట్లు తెలిసింది. ఇటీవల ఏఆర్ కానిస్టేబుల్ రాంబాబుతో ఓ వివాహిత సన్నిహితంగా ఉండడంతో ఆమె భర్త సీపీని ఆశ్రయించగా అర్బన్ స్టేషన్‌లో కేసు నమోదైన విషయం విదితమే. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు శనివారం సదరు మహిళను స్టేషన్‌కు పిలిపించారు. ఆమెకు నోటీస్ ఇచ్చేందుకు పోలీసులు మాట్లాడుతుండగా 'నోటీస్ నేనెందుకు తీసుకోవాలి, కానిస్టేబుల్‌తో కలిసి ఉన్న ఫొటోలు నావి కాదు, నా ఫొటోలను మార్ఫింగ్ చేశారు' అంటూ అరుస్తూ కొంద రితో కలిసి ఘర్షణకు హల్‌చల్ సృష్టించినట్లు తెలిసింది. దీంతో పోలీసులు ఆమెను అక్కడి నుంచి వెళ్లిపోవాలని సూచించారని సమాచారం.

పచ్చదనం, పరిశుభ్రతపై అవగాహన అవసరం

ఖమ్మం సహకారనగర్: పచ్చదనం, పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని శ్రీచైతన్య విద్యాసంస్థల డైరెక్టర్ శ్రీవిద్య అన్నారు. శనివారం నగరంలోని మమత రోడ్‌లో గల శ్రీచైతన్య ఇంటర్నేషనల్ ఒలంపియాడ్ పాఠశాలలో గ్రీన్ ఇండియా మిషన్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్లాస్టిక్ రహిత సమాజంలో ప్రతి ఒక్కరూభాగస్వాములు కావాలని, కాలుష్య నివారణ రహిత యంత్రాలను వినియోగించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న మొక్కల పెంపకం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని, ప్రధాని నరేంద్రమోదీ చేపట్టిన స్వచ్ఛభారత్‌ను సైతం తమ విద్యాసంస్థల్లో అనుసరిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల డీజీఎం చేతన్‌మాదూర్, కో ఆర్డినేటర్ కృష్ణారావు, ప్రిన్సిపాళ్లు టీఎల్ఎన్ శర్మ, నాగప్రవీణ, ఏడుకొండలు, రామకృష్ణారెడ్డి, సురేష్, డీన్స్ కేవీఆర్ రాజశేఖర్‌రెడ్డి, లక్ష్మీనర్సింహ తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న డైరెక్టర్ శ్రీవిద్య

ప్రసవానికి ముందే శిశువు మృతి

- సరైన వైద్యం అందకపోవడమే కారణమని బంధువుల ఆందోళన
- తల్లాడ పీహెచ్‌సీలో ఘటన

తల్లాడ: ప్రసవానికి ముందే గర్భస్థ శిశువు మృతిచెందిన ఘటన తల్లాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చోటుచేసుకుంది. మండలంలోని మల్లవరం గ్రామానికి చెందిన దడిపల్లి లావణ్యకు నెలలు నిండి నొప్పులు వస్తుండటంతో ఆశ వర్కర్ల సూచన మేరకు శుక్రవారం తల్లాడ పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. మండల వైద్యాధికారి రత్న మనోహర్ సాయంత్రం డ్యూటీ ముగించుకొని వెళ్లగా ఇన్‌చార్జ్ డాక్టర్‌గా అన్నారుగూడెం పల్లె దవాఖానా డాక్టర్ గోపి వచ్చారు. మధ్యాహ్నం ఆస్పత్రిలో చేరిన లావణ్యకు సాయంత్రం మళ్లీ నొప్పులు ప్రారంభమయ్యాయి. దీంతో వైద్యులు గోపి, స్టాఫ్ నర్సు కళావతి రాత్రి 9 గంటల వరకు కాన్పు కోసం ప్రయత్నించారు. 9 గంటల తర్వాత లావణ్య నీరసించి నొప్పులు తీసుకోలేకపోయింది. దీంతో బిడ్డ ఉమ్మనీరు తాగి మృతి చెందింది. మృత శిశువు బయటకు రావడంతో లావణ్యకు తీవ్ర రక్తస్రావమైంది. దీంతో భర్త దడిపల్లి అశోక్, బంధువులు లావణ్యను కారులో ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ ఆమె చికిత్స పొందుతోంది. కాగా, బిడ్డ మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని లావణ్య బంధువులు అర్ధరాత్రి వరకు ఆస్పత్రి వద్ద ఆందోళన నిర్వహించారు. ఆస్పత్రి ఎదుటే పోలీస్ స్టేషన్ ఉండడంతో పోలీసులకు ఈ విషయం తెలిపారు. శనివారం వైద్య సిబ్బంది, లావణ్య బంధువులు మధ్య స్టేషన్ వద్ద చర్చలు జరిగాయి. ఈ ఘటనపై డీఎంహెచ్ఓకు, ఉన్నతాధికారులకు విన్నవిస్తామని వైద్యాధికారి రత్న మనోహర్ తెలిపారు. బాలింత వైద్య ఖర్చులు కూడా భరిస్తామని డాక్టర్ గోపి హామి ఇవ్వడంతో వ్యవహారం సద్దుమణిగింది. గతంలో కూడా తల్లాడ ఆస్పత్రిలో వైద్యం అందక ఇద్దరు శిశువులు మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. ఈ విషయమై తల్లాడ ప్రభుత్వ ఆస్పత్రి వైద్యాధికారి రత్న మనోహర్‌ను వివరణ కోరగా శిశువు మృతి చెందకముందే పరిస్థితి గమనించి లావణ్యను ఖమ్మం తీసుకెళ్లాలని వైద్య సిబ్బంది సూచించారని, వారు ఆ సమయంలో తీసుకెళ్లలేదని తెలిపారు. దీంతో నొప్పులు తీయలేక శిశువు ఉమ్మనీరు తాగి మృతి చెందిందని చెప్పారు. అయితే ఇరువర్గాలు స్టేషన్‌కు వచ్చినా.. ఆ తర్వాత చర్చించుకుని ఎవరూ ఫిర్యాదు చేయలేదని ఎస్ఐ కొండల్‌రావు తెలిపారు.



వైద్య సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న లావణ్య బంధువులు

స్టాఫ్ నర్స్ కుమారుడు డాక్టర్ కుర్చీలో..

శిశువు మృతి చెందిన సమయంలో బంధువులు ప్రశ్నించేందుకు వెళ్లినప్పుడు స్టాఫ్ నర్సు కళావతి కుమారుడు మండల వైద్యాధికారి కుర్చీలో కూర్చు ని ఉన్నాడు. ఇన్‌చార్జ్ డాక్టర్ గోపి ఎదురుగా మరో కుర్చీలో కూర్చున్నారు. ఈ దృశ్యాన్ని వీడియో తీయగా అది సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది.

ఉద్యోగం రాలేదనే మనస్తాపంతో ఆత్మహత్య

చింతకాని : ఉద్యోగం రాలేదనే మనస్తాపంతో ఓ నిరుద్యోగి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న ఘటన చింతకాని మండలం నాగులవంచలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. నాగులవంచ గ్రామానికి చెందిన నల్ల మోతు విజయ్‌కుమార్ (25) బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుండగా మూడు నెలల క్రితం తొలిగించారు. నాటి నుంచి ఇంటి వద్దనే ఉంటూ పలు సంస్థల్లో కోసం దరఖాస్తు చేసుకున్నా ఎక్కడా ఉద్యోగం లభించలేదు. దీంతో మనస్తాపానికి గురైన విజయ్‌కుమార్.. శుక్రవారం రాత్రి ఊరికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయటకు వచ్చి పందిళ్లపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో జీటీ ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం రైల్వే ట్రాక్ సిబ్బంది గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఛిద్రమైన మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి నల్లమోతు మోహన్‌రావు ఫిర్యాదు మేరకు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావు కేసు నమోదు చేశారు.

జాగిలాలతో పోలీసుల తనిఖీలు

కొత్తగూడెంఅర్బన్/భద్రాచలంఅర్బన్: గంజాయి లాంటి మత్తు పదార్థాలను గుర్తించేందుకు పోలీసులు జాగిలాలతో కొత్తగూడెం ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్లలో, భద్రాచలం బస్టాండ్, ఓ కిరాణ దుకాణంలో శనివారం తనిఖీలు నిర్వహించారు. జిల్లా డాగ్‌స్క్వాడ్‌లోని జాగిలాలు రీనా, గ్రేసీలు నార్కోటిక్స్ విభాగంలో ప్రత్యేక శిక్షణ పొందాయి. గంజాయి, ఇతర మత్తు పదార్థాలను కనిపెట్టడంలో ఈ జాగిలాలు సమర్థంగా పనిచేస్తున్నాయని ఎస్పీ రోహిత్‌రాజు తెలిపారు. కాగా నిషేధిత గంజాయి అక్రమ రవాణాను నిరోధించేందుకు నార్కోటిక్స్ విభాగంలో ప్రత్యేక శిక్షణ పొందిన పోలీస్ జాగిలాలతో నిత్యం తనిఖీలు చేపట్టనున్నారు.



భద్రాచలం ఆర్టీసీ బస్టాండ్‌లో జాగిలంతో తనిఖీ చేస్తున్న పోలీసులు

కోదండ రామాలయంలో చోరీ

తల్లాడ: మండలంలోని పినపాక కోదండ రామాలయంలో చోరీ జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం రాత్రి ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు స్కూటీపై వచ్చి ఆలయంలోని ఆంజనేయ స్వామి వెండి కిరీటం, 3 ఇత్తడి చెంబులు, ఒక రాగి చెంబు అపహరించారు. వీటి విలువ రూ.12 వేలు ఉంటుందని ఆలయ కమిటీ చైర్మన్ నర్వనేని లక్ష్మణ్‌రావు శనివారం తెలిపారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైర్...

వేంసూరు/నేలకొండపల్లి : వేంసూరు మండల పరిధిలోని రాజుగూడెం, చౌడవరం, నేలకొండపల్లి మండలం ఆరెగూడెం గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైర్ చోరీకి గురైంది. ఆరెగూడెంలో ఆంజనేయులు, చింతల చంద్రయ్య, శీలం సుజాతకు చెందిన వ్యవసాయ మోటార్లు, స్టార్టర్లు, కరెంట్ వైర్లు, కాపర్ చోరీ చేసినట్లు బాధితులు తెలిపారు. కాగా, వేంసూరు ఏఈ అంకురావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వీరప్రసాద్ తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

తిరుమలాయపాలెం: మండలంలోని తెట్టెలపాడు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అదృశ్యం కాగా శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. తెట్టెలపాడు గ్రామానికి చెందిన నాగిశెట్టి రాధాకృష్ణ గ్రానైట్ క్వారీలో స్టోన్ కట్టర్‌గా పనిచేస్తున్నాడు. ఈ ఏడాది ఫిబ్రవరి 1న ఇంటి నుంచి బయటకు వెళ్లిన రాధాకృష్ణ తిరిగిరాలేదు. దీంతో బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెదికినా ఆచూకీ లభించకపోవడంతో తండ్రి శ్రీనివాసరావు ఫిర్యాదుతో శనివారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

యువకుడు అదృశ్యం

బూర్గంపాడు: మండలంలోని మోరంపల్లిబంజర గ్రామానికి చెందిన యారం ప్రశాంత్‌రెడ్డి ఈ నెల 1వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినా ఆచూకీ దొరకలేదు. దీంతో యువకుడి తండ్రి పిచ్చిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేష్ తెలిపారు.

తల్లీ, కుమారుడిపై దాడి

నేలకొండపల్లి : తల్లీ, కుమారుడుపై దాడి చేసిన ఘటన మండలంలోని గువ్వలగూడెంలో చోటుచేసుకుంది. రహదారి వెంట పశువుల కట్టే విషయంలో ఇరువర్గాల నడుమ పంచాయితీ జరగగా గ్రామానికి చెందిన మాధవి, అమె కుమారుడు సతీష్‌పై అదే గ్రామానికి చెందిన పలువురు శనివారం సాయంత్రం దాడి చేశారు. ఈ మేరకు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

పెనుబల్లి : మండల పరిధిలోని టేకులపల్లిలో శుక్రవారం రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి శనివారం హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కల్లూరు మండలం రఘునాథగూడెం గ్రామానికి చెందిన మట్టా రాఘవులు టీవీఎస్‌పై తాళ్లపెంట నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా కల్లూరు వైపు వెళ్తున్న కంటైనర్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాఘవులు తలకు తీవ్ర గాయాలు హైదరాబాద్ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి...



లక్ష్మణ (ఫైల్)

బోనకల్: చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి చెందిన ఘటన బోనకల్‌లో శనివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మరీదు లక్ష్మణ(45) స్థానిక పంచాయతీ కార్యాలయంలో మల్టీపర్పస్ వర్కర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. రెండో శనివారం సెలవు కావడంతో ఉదయం ఆళ్లపాడు వెళ్లే దారిలో రైల్వే ట్రాక్ పక్కన ఉన్న మడుగులో చేపల వేటకు వెళ్లాడు. వల విసిరే క్రమంలో ప్రమాదవశాత్తు మడుగులో పడిపోయాడు. వల చిక్కుకుని నీటిలో పడిపోయి కేకలు వేయగా చుట్టుపక్కల పొలాల్లో ఉన్నవారు గమనించి లక్ష్మణను బయటకు తీశారు. కొన ఊపిరితో ఉన్నట్టుగా గమనించి ఆస్పత్రికి తరలిస్తుండగానే మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట శిబిరంపై దాడి

దమ్మపేట: మండల పరిధిలోని ముష్టిబండ గ్రామ శివారులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై శనివారం పోలీసులు దాడి చేశారు. ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, రూ.4,820 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశామని ఎస్సై సాయికిషోర్ రెడ్డి తెలిపారు.

పేదలకు ఎసరు!

దళిత, పేద రైతులకు యాజమాన్య హక్కులివ్వడం తప్పా?

- దశాబ్దాలుగా తమ భూములపై హక్కులు లేకుండా బతికిన పేద రైతులు
- వారిని సంపూర్ణ భూ యజమానులుగా మార్చేందుకే అసైన్డ్ చట్టం తెచ్చిన వైఎస్ జగన్ ప్రభుత్వం
- ఇదివరకెన్నడూ లేని విధంగా 27 లక్షల మంది రైతులకు లబ్ధి
- తమ భూములపై హక్కులొచ్చాక కొందరు రైతులు అమ్ముకుంటే మీకేంటి బాధ?
- 'తల్లికి వందనం'పై దొంగాట నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికే దుష్ప్రచారం

అసైన్డ్ భూముల రైతులకు చరిత్రాత్మక రీతిలో వైఎస్ జగన్ హయాంలో దక్కిన యాజమాన్య హక్కులను ప్రశ్నించేలా ఎల్లో మీడియా.. ప్రధానంగా 'ఈనాడు' వింత ధోరణి ప్రదర్శిస్తోంది. వారి భూములపై వారికి హక్కులు ఇవ్వడమే నేరమన్నట్లు వక్ర భాష్యాలు చెబుతోంది. పేద రైతులు, దళితులు ఇంకా బానిసత్వం లోనే బతకాలని కోరుకుంటోంది. వారి భూములకు వారు యజమానులుగా మారడం సరికాదంటూ ఏడుపుగొట్టు రాతలతో దుష్ప్రచారం చేస్తోంది. పేదలు, దళితులు ఆర్థికంగా ఎదగడానికి వీల్లేదంటూ పెడబొబ్బలు పెడుతూ కోడిగుడ్డుపై ఈకలు పీకుతోంది.

దశాబ్దాలుగా తాము సాగు చేసుకుంటున్న భూములపై హక్కులు లేక రాష్ట్రంలో లక్షలాది మంది అసైన్డ్ రైతులు అష్టకష్టాలు అనుభవించారు. ఏళ్ల తరబడి ఆ భూములకు హక్కులివ్వాలని ప్రాధేయపడినా ఏ ప్రభుత్వం కనికరించడలేదు. రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా వైఎస్ జగన్ ప్రభుత్వంలో దళిత, ఇతర పేద రైతులకు ప్రభుత్వాలు ఇచ్చిన భూములకు యాజమాన్య హక్కులు లభించాయి. తద్వారా 20 ఏళ్లకు పైబడి తమ ఆధీనంలో ఉన్న అసైన్డ్ భూములపై పేద, దళిత రైతులకు సంపూర్ణ అధికారాలు దఖలు పడ్డాయి. లక్షలాది మంది పేద రైతులు వారి భూములపై యాజమాన్య హక్కులు పొంది సంపూర్ణ రైతులుగా మారారు. తమ భూములపై ఆంక్షలు లేకపోవడం, మంచి ధర రావడంతో కొంత మంది రైతులు వాటిని విక్రయించారు. ఆ సొమ్ము ద్వారా పిల్లల ఉన్నత చదువులు, పెళ్లిళ్లు, ఇళ్లు, ఇతరత్రా ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కారు. చంద్రబాబు అండ్ గ్యాంగ్‌ను వెనకేసుకొస్తున్న 'ఈనాడు'కు ఇది ఏమాత్రం గిట్టడం లేదు.

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో అసైన్డ్ భూముల చట్టాన్నే అపహాస్యం చేసేలా ఈనాడు, ఇతర ఎల్లో మీడియా దిగజారి వ్యవహరిస్తోంది. అసైన్డ్ భూములకు ఎసరు పెట్టేశారంటూ పేద, దళిత రైతులు తమ భూములపై నిర్ణయం తీసుకోవడాన్ని అవమానకరంగా వక్రీకరిస్తోంది. ఆ భూములను అధికారులు, వైఎస్సార్‌సీపీ నేతలు కారుచౌకగా కొనుగోలు చేశారని నిరాధారంగా నిందిస్తోంది. పేద రైతులు కొత్తగా వచ్చిన యాజమాన్య హక్కుల ఆధారంగా తమ భూమిని అమ్ముకుంటే దాన్ని ఇన్‌సైడర్ ట్రేడింగ్ అంటూ విపరీత అర్థాలు తీస్తోంది. ఎంత మంది పిల్లలుంటే అంత మందికి ఏటా రూ.15 వేల చొప్పున 'తల్లికి వందనం' పథకం అమలు చేస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు తల్లికి మాత్రమే ఇస్తామని బొంకుతున్న విషయం బయట పడటంతో.. తమ మోసాన్ని ప్రజలు గ్రహించకుండా దృష్టి మళ్లించడానికి 'చంద్రబాబు అండ్ కో' అసైన్డ్ హక్కుల వ్యవహారాన్ని తెర మీదకు తెచ్చింది. మేనిఫెస్టోలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంపై దృష్టి పెట్టకుండా, ప్రజలకు మేలు చేసేలా గత ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ఎలా తొలగించాలన్న దానిపైనే చంద్రబాబు ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా ఎల్లో మీడియా, ప్రధానంగా ఈనాడు శకుని పాత్ర పోషిస్తోంది. ఏ ప్రభుత్వమైనా ఒక కార్యక్రమాన్ని అమలు చేసినప్పుడు ఎలాంటి పక్షపాతం లేకుండా పరిశీలించి.. ఇంకా ఎలా మంచి చేయొచ్చు అని చెప్పే బాధ్యత పత్రికలకు ఉంటుంది. కానీ మేలు చేస్తున్న కార్యక్రమాలను ఎత్తివేయాలని, తీసివేయాలంటూ పనిగట్టుకుని తప్పుడు రాతలు రాయడం దారుణం. దీనివల్ల అంతిమంగా నష్టపోయేది పేద వాళ్లు. పేదలకు నష్టం చేయడానికే రాష్ట్ర ప్రభుత్వం, ఎల్లో మీడియా ఉన్నట్టు మరోసారి రుజువైంది. చంద్రబాబు, తాము బాగుంటే చాలని ఈనాడు కిరణ్ అనుకోవడం దుర్మార్గం.

అసైన్డ్ భూములు దోచిందెవరు?

నిజంగా అసైన్డ్ భూముల విషయంలో అక్రమాలకు పాల్పడింది ఎవరు? గతంలో చంద్రబాబు ప్రభుత్వం కాదా? రాజధాని పేరుతో ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులను మభ్యపెట్టి, మోసం చేసి 1,100 ఎకరాలు కొట్టేశారు. వాళ్ల చేతిలో ఉంటే పరిహారం రాదని, ప్లాట్లు రావని చెప్పి లాగేసుకున్నారు. ఆ తర్వాత జీవో ఇచ్చి చేతులు మారిన భూములను పూలింగ్ లోకి తీసుకుని టీడీపీ బినామీలకు ప్లాట్లు కేటాయించి కోట్లు కొల్లగొట్టారు. 1,336 మంది బినామీలు ఇలా ఉన్నారు. దీనిపై కేసు నడుస్తోంది. ఈ కేసు దర్యాప్తు ఎంత వరకు వచ్చిందని ఇదే ఈనాడు ఏనాడైనా నాలుగు వాక్యాలు రాసిందా? అసైన్డ్ భూముల సమస్య ఈనాటిది కాదు. పేదలు, రైతులు అందరూ ఇబ్బందులు పడుతున్నారు. భూమి ఉన్నాం కష్టం వస్తే.. దాన్ని ఏదోలా ఉపయోగించుకుందామన్నా.. చేసుకోలేని పరిస్థితి. పైసాకో, పరక్కో ఏదో ఒక కాగితం మీద రాసిచ్చి ఎంతో కొంత తీసుకునే పరిస్థితి. రికార్డుల్లో ఒక పేరు.. భూమి దగ్గరకు వస్తే మరొకరి పేరు. దేనికీ పొంతన లేదు. ఒకరేమో కష్టం తీర్చుకోవడం కోసం అమ్ముకుంటే, దాన్ని కొనుక్కున్నవాడికీ కంటిమీద కునుకులేని పరిస్థితి. ఈ నేపథ్యంలో పేదలకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అసైన్డ్ భూముల చట్టానికి సవరణలు చేసింది. గత ఏడాది అక్టోబరు 27న దీనికి సంబంధించి గెజిట్ జారీ అయ్యింది. నిజంగా ఎవరో ఒకరికి లబ్ధి చేకూర్చాలనుకుంటే.. ఎవరి ఆధీనంలో భూమి ఉంటే వారికే ఇచ్చేయండి అని చెప్పేవారు. కాని అలా జరగలేదు. ఏ పేదవాడు అయితే లబ్ధిదారో, ఒరిజనల్ అసైనీగా ఉన్నాడో, వారు లేకపోతే వారసులు ఎవరున్నారో వారికే సర్వహక్కులూ ఇవ్వండని చెప్పింది. ఇందులో తప్పు ఏముంది? ఇప్పుడు వీరందర్నీ రోడ్డు మీదకు ఈడ్చాలని చూస్తున్నారా? పేదల పొట్టకొట్టాలని చూస్తున్నారా?

ఇదీ అసైన్డ్ భూముల నేపథ్యం

వివిధ కేటగిరీలకు చెందిన లబ్ధిదారులకు వ్యవసాయం కోసం భూమి అసైన్డ్ చేసే విధానం కొన్ని దశాబ్దాల క్రితం మొదలైంది. 1954కు ముందు అసైన్ చేసిన భూములది ఒక కేటగిరీ, 1954 తర్వాత మరో కేటగిరీ. 1954కు ముందు అసైన్డ్‌దారులకు ఇచ్చిన పట్టాల్లో ఎక్కడా అమ్ముకోకూడదనే షరతు లేదు. 1954 తర్వాత ఇచ్చిన అసైన్డ్ పట్టాల్లో మాత్రం ఈ నిబంధన పెట్టారు. దీంతో ఆ భూములన్నీ నిషేధిత జాబితాలో చేరాయి. వాటిని అమ్ముకునే అవకాశం లేదు. గతంలో చంద్రబాబు ప్రభుత్వం చేసిన వెబ్‌ల్యాండ్ దుర్మార్గాల వల్ల 1954కు ముందు అసైన్డ్ చేసిన భూములను కూడా నిషేధిత జాబితాలో చేర్చారు. వాటిని తొలగించుకోవడానికి రెవిన్యూ అధికారుల చుట్టూ తిరిగి, లంచాలు ఇచ్చి విసిగిపోయిన రైతులు ఎంతో మంది ఉన్నారు. 1954 నుంచి కూడా పేదలకు భూములు ఇవ్వడం (అసైన్‌మెంట్లు) జరుగుతూనే ఉంది. అయితే 70 సంవత్సరాల తర్వాత కూడా ఆ భూముల మీద వారికి హక్కులు లేవు. రెండు, రెండున్నర ఎకరాల వరకూ అసైన్‌మెంట్ పట్టా ఉన్న వాళ్లు తమ అవసరాల కోసం ఒక అరెకరం అమ్ముకోవాలనుకుంటే చట్ట ప్రకారం అమ్ముకోవడం కుదరదు. దీంతో సాదా బైనామా (కాగితాల మీద రాసుకోవడం) పద్ధతిలో భూముల అమ్మకాలు జరిగాయి. దీనివల్ల నిరుపేదలైన అసైనీలకు రావాల్సిన రేటులో కనీసం 25 శాతం కూడా వచ్చేది కాదు. భూమిని అమ్ముకోకుండా సాగు చేసుకున్న వారు కూడా టైటిల్ లేకపోవడంవల్ల రెవెన్యూ శాఖ నుంచి ఎప్పుడైనా నోటీసులు వస్తాయని, ఆ భూమిని ప్రభుత్వం ఎక్కడ తీసేసుకుంటుందోనని, ఎక్కడ రిజర్వ్ చేస్తుందోనని భయాందోళనలు ఉండేవి. ఇటు అసైనీకి.. అటు కొనుక్కున్న వారికి లబ్ధి లేదు. మరోవైపు రెవెన్యూ రికార్డులు క్షేత్ర పరిస్థితిని తెలియజెప్పేలా లేవు. రికార్డులు ఒకరి పేరు మీద ఉంటే..

అసైన్డ్ భూములకు హక్కులపై 'ఈనాడు' వక్రభాష్యం



భూములు మరొకరి ఆధీనంలో ఉన్నాయి. ఇప్పటి వరకు సుమారు 19,21,855 మందికి 33,29,908 ఎకరాలను ప్రభుత్వాలు అసైన్‌మెంట్ చేస్తే.. ఆ రికార్డులేవీ క్షేత్ర స్థాయికి అనుగుణంగా లేవు.

అధ్యయనం తర్వాతే అసైన్డ్ చట్ట సవరణ

కలెక్టర్లు పలుమార్లు వైఎస్ జగన్ ప్రభుత్వం దృష్టికి అసైన్డ్ భూముల సమస్యను తీసుకువచ్చాక రెవెన్యూ మంత్రి నేతృత్వంలో 13 మంది ఎస్సీ, ఎస్టీ ఎమ్మెల్యేలతో 2022 ఆగస్టు 30వ తేదీన ఒక కమిటీ వేశారు. ఆ కమిటీ కర్ణాటక, తమిళనాడులో పర్యటించి అక్కడి విధానాలపై అధ్యయనం చేసింది. అసైన్‌మెంట్ భూములకు సంబంధించి ఇతర రాష్ట్రాల్లో ఉన్న చట్టాలు, నియమ నిబంధనలను పరిశీలించి రాష్ట్ర ప్రభుత్వానికి ఒక నివేదిక ఇచ్చింది. అసైన్ చేసిన 20 ఏళ్ల తర్వాత అసలైన ఒరిజనల్ లబ్ధిదారులకు, లేదా వారి వారసులకు అవసరమైనప్పుడు అమ్ముకునేందుకు వీలు కల్పించాలని, దానికి అనుగుణంగా ఏపీ అసైన్‌మెంట్ చట్టం (పీఓటీ)– 1977కు సవరణలు చేయాలని ఆ కమిటీ సిఫారసు చేసింది. దీనికి అప్పటి మంత్రివర్గం ఆమోదం తెలిపి, చట్టానికి సవరణలు చేసింది. అదే సందర్భంలో 20 ఏళ్లకు ముందే ఎవరైనా పేద రైతుల నుంచి భూములు కొనుక్కుని ఉంటే వారికి ఎలాంటి ప్రయోజనం ఉండదు. వారికి ఎలాంటి హక్కులూ రావు. వారి విషయంలో 1977 నాటి పీఓటీ చట్టం అమల్లో ఉన్నట్టే. దీనివల్ల అసైన్‌మెంట్ అయిన దగ్గర నుంచి 2023లో చట్ట సవరణ జరిగే వరకు అసైన్‌మెంట్ భూమిలో వ్యవసాయం చేసుకుంటున్న పేద బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు చెందిన రైతులకు మాత్రమే మేలు కలుగుతుంది. అంటే ఒరిజనల్ అసైనీలకు మాత్రమే లబ్ధి చేకూరుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో.. అందులో తప్పులు జరిగాయని, రద్దు చేయాలనే వాదనలో ఏమైనా అర్థం ఉందా? ఎవరికైనా లబ్ధి చేకూర్చాలనుకుంటే ఒరిజనల్ అసైనీలకే హక్కులు ఇవ్వాలనే షరతు చట్టంలో ఎందుకు పెడతారు?

27 లక్షల ఎకరాలపై పేదలకు హక్కులు

వైఎస్ జగన్ హయాంలో జరిగిన అసైన్డ్ చట్ట సవరణ ద్వారా సుమారు 15,21,160 మంది భూమిలేని నిరుపేదలకు వారికి సంబంధించిన 27,41,698 ఎకరాలపై పూర్తి యాజమాన్య హక్కులు లభిస్తున్నాయి. 20 సంవత్సరాలకు ముందు ఇచ్చిన భూములన్నింటికీ ఇది వర్తిస్తుంది. ఈ భూములన్నీ 1954 తర్వాత అసైన్‌మెంట్ చేసినవే.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో ఏపీ ముందడుగు

గత ప్రభుత్వంలో సీఎం జగన్ విప్లవాత్మక చర్యలే ఇందుకు కారణం

- పలు రంగాల్లో ముందు వరుసలో రాష్ట్రం
- 2023–24 సుస్థిరాభివృద్ధి లక్ష్యాల పురోగతి నివేదిక స్పష్టీకరణ
- మాతా, శిశు మరణాలు భారీగా తగ్గుదల
- 15.60% నుంచి 6.06%కి తగ్గిన పేదరికం
- విద్యలో పెరిగిన నాణ్యత.. ఎలిమెంటరీ, ఉన్నత విద్యలో పెరిగిన ఎన్‌రోల్‌మెంట్
- ఆస్పత్రుల్లోనే కాన్పులు 99.98 శాతం
- ఆరోగ్యశ్రీతో నాలుగింట మూడోవంతుకు పైగా కుటుంబాలకు ఆరోగ్య ధీమా



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ పలు రంగాల్లో స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల సాధనలో ఫ్రంట్ రన్నర్‌గా ముందుకు దూసుకుపోతోంది. 2020–21తో పోల్చితే 2023–24లో పేదరికం, మాతా శిశు మరణాల రేటు భారీగా తగ్గింది. ఆస్పత్రుల్లో కాన్పులు పెరగడంతో పాటు పిల్లలకు నూరు శాతం రోగ నిరోధక శక్తి టీకాలు విజయవంతంగా వేయించింది. విద్యలో నాణ్యత పెరగడంతో పాటు ఎలిమెంటరీ, ఉన్నత విద్యలో ఎన్‌రోల్‌మెంట్ పెరిగింది. రాష్ట్రంలో 80 శాతానికి పైగా కుటుంబాలకు ఆరోగ్య భరోసా లభించింది. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆయా రంగాల్లో తీసుకున్న విప్లవాత్మక చర్యలే ఇందుకు కారణం. ఈ మేరకు నీతి ఆయోగ్ విడుదల చేసిన 2023–24 సుస్థిరాభివృద్ధి లక్ష్యాల పురోగతి నివేదిక స్పష్టం చేసింది. నీతి ఆయోగ్ నిర్దేశించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ స్వయంగా ఉన్నత స్థాయి సమావేశాలు నిర్వహించి సమీక్షించారు. అంతటితో ఆగకుండా గ్రామ, వార్డు సచివాలయాల స్థాయి నుంచి సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనను అనుసంధానం చేశారు. నవరత్నాలతో పేదరికం.. మాతా శిశు మరణాలు తగ్గించడం, నాణ్యమైన విద్య, అర్హులందరికీ వైఎస్సార్ ఆరోగ్య శ్రీని వర్తింప చేయడం, ఆస్పత్రుల్లోనే కాన్పులు జరిగేలాగ చర్యలు తీసుకోవడంతో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో ఆంధ్రప్రదేశ్ ఫ్రంట్ రన్నర్ రాష్ట్రాల్లో నిలిచింది. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధన మూడో నివేదికతో పోల్చితే నాలుగో నివేదికలో పలు రంగాల్లో ఆంధ్రప్రదేశ్ పురోగతిలో దూసుకుపోతున్నట్లు స్పష్టమైంది. పేదరికం శాతం 15.60 నుంచి 2023–24 నాటికి 6.06 శాతానికి తగ్గింది. పేదరికం తగ్గించడంలో తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు ఫ్రంట్ రన్నర్‌లో ఉన్నట్లు నివేదిక పేర్కొంది.

80.20% కుటుంబాలకు ఆరోగ్య భరోసా

ఆంధ్రప్రదేశ్‌లోని ఆరోగ్య బీమా పథకాన్ని 80.20 శాతం కుటుంబాలకు వర్తింప చేసినట్లు నివేదిక స్పష్టం చేసింది. అంతకు ముందు 74.60 శాతం కుటుంబాలకే ఆరోగ్య బీమాను వర్తింప చేశారని పేర్కొంది. మాతా శిశు మరణాలను తగ్గించడంలో ఆంధ్రప్రదేశ్ టాప్ ఐదు రాష్ట్రాల్లో ముందుంది. ప్రతి లక్ష జననాలకు ప్రసూతి మరణాల నిష్పత్తి 65 నుంచి 45కు ఆంధ్రప్రదేశ్‌లో తగ్గిందని, ప్రతి వెయ్యి సజీవ జననాల్లో ఐదేళ్లలోపు శిశు మరణాలు 33 నుంచి 27కు తగ్గాయని నివేదిక తెలిపింది. ఈ లక్ష్యాల్లో ఆంధ్రప్రదేశ్ మెరుగైన ఫలితాలను సాధించినట్లు నివేదిక వెల్లడించింది. 9 నుంచి 11 నెలల పిల్లలకు రోగ నిరోధక శక్తి టీకాలు ఇప్పించడంలో 87 శాతం నుంచి నూటికి నూరు శాతం లక్ష్యాలను సాధించిందని నివేదిక స్పష్టం చేసింది.

నీతి ఆయోగ్ నివేదిక ఇంకా ఏం చెప్పిందంటే..

- ఆస్పత్రుల్లోనే 99.98 శాతం కాన్పులు
- 87.98 శాతం నుంచి 96.90 శాతానికి పెరిగిన ఎలిమెంటరీ ఎన్‌రోల్‌మెంట్
- 46.84 % నుంచి 56.70 % శాతానికి పెరిగిన ఉన్నత సెకండరీ ఎన్‌రోల్‌మెంట్
- స్కూల్స్‌లో 91.26 % నుంచి 98.80 శాతానికి పెరిగిన తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు
- సెకండరీ స్థాయిలో శిక్షణ పొందిన ఉపాధ్యాయుల శాతం 75.18 నుంచి 82.50కి పెరుగుదల
- నూటికి నూరు శాతం మెరుగు పడిన గ్రామీణ జనాభాకు తాగునీటి సరఫరా
- నూరు శాతం మందికి సరసమైన ధరలకు స్వచ్ఛమైన ఇంధనం సరఫరా
- విద్యుత్ కనెక్షన్లలో నూరు శాతం లక్ష్య సాధన
- ఎల్‌పీజీ, పీఎన్‌జీ కనెక్షన్లలో 103.56 శాతం లక్ష్య సాధన
- స్థిర ధరల ఆధారంగా 3.84% నుంచి 4.05% పెరిగిన తలసరి జీడీపీ వార్షిక వృద్ధి రేటు
- 5.70 శాతం నుంచి 4.40 శాతానికి తగ్గిన 15–59 ఏళ్ల మధ్య నిరుద్యోగిత
- రాష్ట్ర మొత్తం స్థూల ఉత్పత్తి విలువలో 9.5 శాతం నుంచి 12.79 శాతానికి పెరిగిన తయారీ రంగం విలువ

జిల్లా వార్తలు

పెరుగుతున్న నీటిమట్టం



వైరా రిజర్వాయర్

వైరా/అశ్వారావుపేటరూరల్ : మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వైరా రిజర్వాయర్ నీటి మట్టం పెరుగుతోంది. మూడు రోజుల క్రితం 5 అడుగులున్న నీటి మట్టం.. ఎగువ ప్రాంతం నుంచి 350 క్యూసెక్కుల వరద రావడంతో ప్రస్తుతం 7.5 అడుగులకు చేరింది. దీంతో ఖరీఫ్‌లో పంటలు సాగు చేస్తున్న రైతులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ఇక అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లి సమీపంలోని పెదవాగు ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 18 అడుగులు కాగా, శనివారం రాత్రి వరకు 15 అడుగులకు చేరింది. ఇంకా వరద ప్రవాహం వస్తుండటంతో నీటి మట్టం పెరిగే అవకాశం ఉందని, పూర్తి స్థాయి నీటి మట్టం చేరితే గేట్లు ఎత్తి దిగువకు విడుదల చేస్తామని ప్రాజెక్టు ఏఈఈ కేఎస్‌వీ కృష్ణ తెలిపారు.



భారీగా నీరు చేరిన పెదవాగు ప్రాజెక్టు

గౌరీశంకర్‌కు మాజీ ఉపరాష్ట్రపతి అభినందన



సూక్ష్మకళ ఆల్బమ్ చూపిస్తున్న గౌరీశంకర్

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లికి చెందిన అంతర్జాతీయ సూక్ష్మ కళాకారుడు గౌరిశంకర్‌ను మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అభినందించారు. విశాఖపట్టణంలో శనివారం 75వ జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న వెంకయ్యనాయుడుకు పెన్సిల్ కొనపై ఆయన చిత్రాన్ని గీసి గౌరీశంకర్ బహుకరించగా.. ఆయన చేస్తున్న సూక్ష్మకళ గురించి తెలుసుకున్న వెంకయ్యనాయుడు అభినందించారు.

మొక్కజొన్నకు మళ్లీ 'కత్తెర'





ఎదుగుదల లోపించిన మొక్కజొన్న చేను
(ఇన్‌సెట్) మొక్కజొన్న కాండంలో కత్తెర పురుగు

- ఈసారి మొక్క దశలోనే కత్తెర పురుగు గుర్తింపు
- ఇతర పంటలకూ విస్తరించే ప్రమాదం
- రైతులకు అవగాహన కల్పించకపోతే పెరగనున్న నష్టం

ఇల్లెందురూరల్: ఈ ఏడాది మొక్కజొన్న సాగు చేసిన రైతులు మొక్కలు ఏపుగా పెరుగుతుండటం .. అది చూసి సంతోషపడే లోపే 'కత్తెర' పడింది. కత్తెర పురుగు ఆనవాళ్లు కనిపించడంతో వారి ఆనందం ఆవిరవుతోంది. పురుగు ఉధృతి కారణంగా మొక్కజొన్న ఎదుగుదల క్షీణిస్తుండగా, ఆకులు మాడిపోతుండటంతో రైతులు కలవరపడుతున్నారు. కాగా, రెండేళ్ల అనంతరం ఈసారి కత్తెర పురుగు పంటను ఆశించడం గమనార్హం.

మూడేళ్ల పాటు విధ్వంసం

2016లో దేశంలోని కర్ణాటక రాష్ట్రంలో కత్తెరపురుగు ఉధృతితో వేలాది ఎకరాల్లో పంటలు నాశనమయ్యాయి. దీంతో జాతీయ వ్యవసాయ పరిశోధన మండలి (ఐకార్) అన్ని రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. ఆపై 2018లో తెలంగాణలోని సిద్దిపేట జిల్లాలో కత్తెర పురుగు ఆనవాళ్లను మొక్కజొన్న పంటలో గుర్తించగా.. అన్ని జిల్లాలకు విస్తరించింది. సుమారు మూడేళ్ల పాటు పురుగు ఉధృతితో మొక్కజొన్న సాగు విస్తీర్ణం, దిగుబడిపై ప్రభావం పడింది. అయితే, శాస్త్రవేత్తల సూచనలు పాటించడం, రసాయనాల పిచికారీతో రైతులు కత్తెర పురుగు ఉధృతిని నివారించగలిగారు.

రెండేళ్ల తర్వాత మళ్లీ..

మూడేళ్ల పాటు చుక్కలు చూపించిన కత్తెర పురుగు క్రమంగా అంతరించిపోవడంతో రైతులు ఆనందంగా మొక్కజొన్న సాగుపై దృష్టి సారించారు. కానీ, ఇప్పుడు మళ్లీ కత్తెర పురుగు ఆనవాళ్లు పలు గ్రామాల్లో కనిపిస్తున్నాయి. తొలుత లద్దె పురుగుగా భావించినప్పటికీ రైతులు గత అనుభవంతో కత్తెర పురుగుగా అనుమానించారు. ఆపై వ్యవసాయశాఖ అధికారులు పరిశీలించి నిర్ధారించడంతో కలవరం మొదలైంది. కాగా, గతంలో కంకి దశలో మొక్కజొన్నను ఆశించిన పురుగు ఈసారి మొక్క దశలోనే వస్తున్న నేపథ్యాన మందుల పిచికారీ కోసం రైతులు దుకాణాలకు పరుగులు తీస్తున్నారు.

పంటపై మక్కువ..

కత్తెర పురుగుకు మొక్కజొన్న పంట అంటేనే మక్కువ అని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. మొక్కజొన్న ఎక్కువగా సాగయ్యే చోట కత్తెర పురుగు ప్రభావం స్పష్టంగా కనిపిస్తుందని గతంలో గుర్తించారు. మొక్కజొన కాండం, మొగిలో ఉండి పంటకు నష్టాన్ని చేకూరుస్తుందని, మక్క సాగు లేకపోతే పత్తి, వరి, జొన్న వంటి 80 రకాల పంటలపైనా కత్తెర పురుగు ప్రభావం చూపిస్తుందని అధికారులు తెలిపారు.

గుర్తింపు, సస్యరక్షణ

ముదురు పసుపు రంగు ముత్యాల మాదిరి గుడ్లు ఆకుల అడుగు భాగం, కాండంపై కనిపిస్తాయి. ఎదిగిన లార్వా ముదురు గోధుమ రంగులో తలపై తల కిందులుగా 'వై' ఆకారపు గుర్తు ఉంటుంది. తోక వైపు ఎనిమిదో కణుపుపై నాలుగు నల్లని చుక్కలు చతురస్రాకారంలో కనిపిస్తాయి. కాగా, పంట విత్తిన వెంటనే ఎకరానికి నాలుగు లింగాకర్షక బుట్టలను అమరిస్తే పురుగు ఉనికిని గుర్తించవచ్చు. మొక్కల్లో పక్షులు వాలడానికి 'టీ' ఆకారపు కర్రలు అమర్చుకోవాలి. వ్యవసాయశాఖ అధికారుల సూచన మేరకే రసాయన మందులు వినియోగించాలి. కత్తెర పురుగు సూర్యరశ్మి ఉన్నంతసేపు ఆకు కాండంలోనే తలదాచుకుని రాత్రివేళ బయటకు వచ్చి పంటను హరిస్తుంది. ఈ కారణంగా ఉదయం లేదా సాయంత్రం క్రిమిసంహారక మందులు పిచికారీ చేస్తేనే ఫలితముంటుంది.

పురుగు ఉధృతిని గుర్తించాం



ఇల్లెందు మండలంలోని పలు గ్రామాల్లో పంటలను పరిశీలించాం. ప్రధానంగా మొక్కజొన్న పంటపై కత్తెర పురుగు దాడి ప్రారంభమైనట్లు గుర్తించాం. పంటను కాపాడుకునేలా రైతులను అప్రమత్తం చేస్తున్నాం. సస్యరక్షణ చర్యలు తక్షణం ప్రారంభించేలా సూచనలు ఇస్తున్నాం.

–సతీశ్, వ్యవసాయాధికారి, ఇల్లెందు

మా కాలేజీలో చేరండి !

కౌన్సెలింగ్ సెంటర్‌లో 'ప్రైవేట్' ప్రచారం

ఖమ్మం సహకారనగర్: ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రవేశానికి నిర్వహిస్తున్న కౌన్సెలింగ్ ఖమ్మంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో కొనసాగుతోంది. ఈక్రమంలో జిల్లాతో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లోని ప్రైవేట్ కళాశాలల పీఆర్వోలు ఇక్కడ తిష్ట వేశారు. సర్టిఫికెట్ల పరిశీలనకు వచ్చిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడి తమ కళాశాలలోని సౌకర్యాలు, ప్లేస్‌మెంట్లను వివరిస్తూ చేరాలని కోరుతున్నారు. అంతేకాక తల్లిదండ్రుల ఫోన్ నంబర్లు సేకరించి అక్కడికక్కడే వివరాలను వాట్సప్‌లో పంపిస్తున్నారు. మునుపెన్నడూ లేని విధంగా సెంటర్ ఆవరణలో ప్రైవేట్ కళాశాలల బాధ్యులు ఇష్టారాజ్యంగా ప్రచారం చేస్తున్నా కనీసం వారిని బయటకు పంపించాలనే ఆలోచన ఎవరూ చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. కాగా, ఇంజనీరింగ్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు నిర్వహిస్తున్న సర్టిఫికెట్ల పరిశీలన ఆదివారంతో ముగియనుందని కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ జకీరుల్లా, కౌన్సిలింగ్ కేంద్రం కో ఆర్డినేటర్ ఎం.సుబ్రహ్మణ్యం తెలిపారు.



ఓ విద్యార్థి వివరాలు సేకరిస్తున్న ప్రైవేట్ కళాశాల పీఆర్వో

రైతన్నకు వరంలా ఫామ్ పాండ్



ప్లాస్టిక్ షీట్ పరవక ముందు ఫామ్ పాండ్..

- నీటి నిల్వతో పంటల కీలక దశలో ఉపయోగం
- భూగర్భ జలాల పెంపునకు దోహదం
- సబ్సిడీ ద్వారా అండగా వ్యవసాయ శాఖ

వైరా: వర్షాలు సకాలంలో కురవడం లేదు. ఒకవేళ కురిసినా ఏటా పెరుగుతున్న పంటల సాగుకు నీటి లభ్యత ఉండటం లేదు. దీంతో రైతులు పొలాల్లో బావులు తవ్వించినా, బోర్లపై బోర్లు వేసినా ఇక్కట్లు ఎదురవుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యాన వర్షం కురిసినప్పుడు నిల్వ చేసుకోవడం, భూగర్భ జలాల పెంపునకు మార్గాలు అన్వేషించడంపై దృష్టి సారించాలని అధికారులు సూచిస్తున్నారు. ఇందులో భాగంగా రైతులకు అండగా ఉండేందుకు వర్షాధార మండలాలకు ప్రధానమంత్రి కృషి సంచార్ యోజన పథకం కింద వ్యవసాయ శాఖ ఫాంపాండ్లు మంజూరు చేస్తోంది. ఇదే సమయాన ప్రభుత్వ సాయం లేకుండా కూడా కొద్దిపాటి ఖర్చు చేయగలిగితే వర్షపు నీటిని నిల్వ చేసుకునేలా సాగు భూమిలోని లోతట్టు ప్రాంతాల్లో వీటిని నిర్మించుకోవచ్చు.

నీటి కుంటల ఏర్పాటు

రైతులు తమ పొలాల్లో చిన్నపాటి కుంటలు నిర్మించుకునేందుకు ప్రభుత్వం 90 శాతం సబ్సిడీ అందించనుంది. 20 మీటర్ల అడ్డు, 20 మీటర్ల పొడవు, మూడు మీటర్ల లోతుతో కుంటను తవ్వేందుకు రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షలు కేటాయిస్తారు. ఇలా తవ్విన నీటి కుంటలో దాదాపు 8.94 లక్షల లీటర్ల నీరు నిల్వ చేసుకునే అవకాశముండగా, ఈ నీరు రెండున్నర ఎకరాలకు సరిపోతుంది. కాగా, ఈ విధానంలో నీటి కుంటను తవ్వుతున్న కొద్దీ వచ్చే మట్టిని నాలుగు వైపులా ఒడ్డు మాదిరిగా పోసి, నలువైపులా వాలు వచ్చేలా ఏర్పాటు చేసుకోవాలి. కుంట అడుగున, నాలుగువైపులా రాళ్లు లేకుండా చేసి చెక్కదిమ్మతో గట్టి పడేలా చూస్తూ ప్లాస్టిక్ షీట్ వేయాలి.

నీరు ఇంకకుండా..

కుంటల్లో నీరు నిల్వ చేసినా నీరు, మట్టి రకాల ఆధారంగా భూమిలోకి ఇంకిపోతుంది. ఇసుక నేలల్లోనైతే దాదాపు 70 శాతం నీరు ఇంకిపోతుంది. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని నీటి కుంటల్లో ప్లాస్టిక్ షీట్ వేయడం తప్పనిసరి చేశారు. 250 మైక్రాన్ల మందం కలిగిన ప్లాస్టిక్ షీట్ ఇందుకు అనుకూలంగా ఉంటుంది. 7–9 మీటర్ల వెడల్పుతో లభించే ఈ షీట్‌ను కుంట అడుగు భాగం నుంచి పైకి పరవాలి.



ఏన్కూరు మండలంలో నీటితో కళకళలాడుతున్న ఫాంపాండ్ వద్ద రైతు

ఉపయోగాలు ఏమిటంటే..

నీటి నిల్వ కోసం తవ్వే కుంటల్లో ప్లాస్టిక్ షీట్లు పరవడం ద్వారా ఇంకిపోయే అవకాశముండదు. అంతేకాక కలుపు మొక్కలు పెరగవు. నిల్వ నీటిని అవసరానికి అనుగుణంగా పంటలకు ఉపయోగించుకోవడమే కాక చేపల పెంపకంతో అదనపు ఆదాయం పొందొచ్చు. ప్లాస్టిక్‌కు సాగే గుణం ఉండడంతో అధిక నీటి ఒత్తిడిని సైతం తట్టుకుంటుంది. కాగా, బోర్లు ఉన్న రైతులకు ఈ నీటి కుంటలు ఎంతో ఉపయోగపడతాయి. ఎప్పటికప్పుడు కుంటను నింపుతూ అవసరమైనప్పుడు వాడుకునే వెసలుబాటు ఉంటుంది.

డ్రిప్ ద్వారా పంటలకు..

చాలామంది రైతులు వర్షపు నీటిని ఫాంఫాండ్‌లో నిల్వ చేశాక అవసరానికి అనుగుణంగా పంటలకు నేరుగా పంపిస్తారు. అలాకాకుండా డ్రిప్ విధానంలో పంటలకు సరఫరా చేస్తే నీటి వృథాను అరికట్టవచ్చు. అంతేకాక కుంటల సమీపాన బోర్లు వేస్తే అవి రీచార్జ్ అవుతాయి. జిల్లాలో ఏన్కూరు, తిరుమలాయపాలెం, బోనకల్, ఎర్రుపాలెం మండలాల్లో పలువురు రైతులు తమ పొలాల్లో ఫాంపాండ్లు నిర్మించుకుని సత్ఫలితాలు సాధిస్తున్నారు. నాలుగైదు ఎకరాల భూమి ఉన్న రైతులు ముందుకు రావాలని అధికారులు సూచిస్తున్నారు. ఇందుకోసం ఆయా మండలాల వ్యవసాయాధికారులు, ఉపాధిహామీ పథకం ఉద్యోగులను సంప్రదిస్తే వివరాలు వెల్లడిస్తారు.